# నేడు అక్కినేని పురస్కారాల ప్రదానోత్సవం



వేదికపై డాక్టర్ తోటకూర ప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

విజయవాడ, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కృష్ణా జిల్లా గుడివాడలో అక్కినేని అంతర్జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ తెలిపారు. మంగళవారం విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగానికి చెందిన పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్ రెడ్డి, న్యాయ విభాగానికి చెందిన జస్టిస్ ఎస్.పర్వతరావు, పౌరసేవల విభాగానికి చెందిన ఐఏఎస్ అధికారి పి.వసంత్ కుమార్, విద్యారంగానికి చెందిన ఎం.ఎస్.రాజు, చిత్ర రంగానికి చెందిన డాక్టర్ కె.రాఘవేంద్రరావు, ఆరోగ్యరంగానికి డాక్టర్ మన్నం గోపీచంద్, రంగస్థలానికి చెందిన గుమ్మడి గోపాలకృష్ణ, సామాజిక రంగానికి చెందిన డాక్టర్ వంశీ రామరాజు, యువత-క్రీడారంగం నుంచి వెన్నం జ్యోతి సురేఖలకు అక్కినేని అంతర్జాతీయ పురస్కారాలను అందచేయనున్నట్లు డాక్టర్ ప్రసాద్ తెలిపారు. డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. 9 అడుగుల అక్కినేని కాంస్యవిగ్రహాన్ని 6.5 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అక్కినేని కుటుంబ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి కామినేని శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. వ్యాసరచన పోటీలు, అక్కినేని గీతాలతో సంగీత విభావరి ఉంటుందన్నారు.

## శ్రీవారి ఆలయంలో మొదలైన ధనుర్మాస కైంకర్యాలు

తిరుమల, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీ వారి ఆలయంలో మంగళవారం సాయంత్రం 4.42 గంటలకు ధనుర్మాసం కైంకర్యాలు ప్రారంభమయ్యాయి. శుద్ధి, గంట, నివేదన తదితర శాస్త్రోక్తపూజ తర్వాత రాత్రి 8 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. బుధవారం వేకువజాము నుంచి సుప్రభాతం స్థానే తిరుప్పావై ప్రవచనం పఠిస్తారు.

## నేడు బాధ్యతలు స్వీకరించనున్న టీటీడీ ఈవో సాంబశివరావు

తిరుపతి/ తిరుమల, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ నూతన ఈవో డి.సాంబశివరావు బుధవారం మధ్యాహ్నం శ్రీవారి ఆలయంలో ఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం ఈవో ఎంజీ గోపాల్ రిలీవ్ కానున్నారు. సాంబశివరావు మంగళవారం శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వరస్వామిని, కాణిపాక వినాయకస్వామిని దర్శించుకున్నారు.